సాక్షి
కాకినాడ
గురువారం । 4 । సెప్టెంబర్ । 2025



ఫ్లెక్సీలపై చర్యలకు డిమాండ్

వివిధ ప్రాంతాల్లో వివాదాస్పద వ్యాఖ్యలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలు దళిత సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు.


8లో



స్ప్రేయర్ మొరాయిస్తే.. ఫియరే..!

పంటలను ఆశించిన చీడపీడల నివారణకు స్ప్రేయర్లతో పరుగు మందులు పిచికారీ చేస్తారు. చిన్నచిన్న జాగ్రత్తలు తీసుకుంటే అవి ఎక్కువ కాలం మన్నికగా ఉంటాయి.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం 8,37,974 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రం లోకి విడుదల చేశారు. డెల్టాలకు సంబంధించి తూర్పు డెల్టాకు 4,900, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల చొప్పున విడిచి పెట్టారు.

న్యూస్‌రీల్

7న పంచారామ క్షేత్రం మూసివేత



సామర్లకోటలోని పంచారామ క్షేత్రం

సామర్లకోట: చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని 7వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 12 గంట నుంచి సోమవారం ఉదయం 9 గంటల వరకు పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయం మూసి వేయనున్నట్టు ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ చంద్రగ్రహణం వీడిన తరువాత సోమవారం ఉదయం ఆలయంలో సంప్రోక్షణ నిర్వహించి భక్తులకు దర్శనాలు కలిపించనున్నట్టు ఆయన తెలిపారు. భక్తులు ఈ అసౌకర్యాన్ని గమనించాలన్నారు. అలాగే అతి పురాతన విష్ణు ఆలయం మాండవ్య నారాయణస్వామి ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు మూసివేసి సోమవారం ఉదయం 9.30 గంటలకు తెరవనున్నట్టు ఆలయ ఈఓ బిక్కిన వెంకట్రాయచౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే పట్టణ, మండల పరిధిలోని అన్ని దేవాలయాలను మధ్యాహ్నం నుంచి మరుసటి రోజు ఉదయం 9 గంటల వరకు మూసి వేయనున్నట్టు ఆయా ఆలయాల కమిటీ నాయకులు తెలిపారు.

ఆందోళనకరంగా భూగర్భ జలాలు



సమావేశంలో మాట్లాడుతున్న భూగర్భ జలశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్

నల్లజర్ల: మండలంలో భూగర్భ జలాలు ప్రమాదకర స్థాయికి అడుగంటాయని, తక్షణం నీటి సంరక్షణ చేపట్టకపోతే ఈ ప్రాంతంలోని పంట భూములు ఎడారిగా మారే ప్రమాదం ఉందని భూగర్భ జలశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ హెచ్చరించారు. నల్లజర్ల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం డ్వామా, వ్యవసాయ, ఉద్యాన, నీటిపారుదలశాఖ అధికారులతో సమావేశమై భూగర్భ జలాల సంరక్షణ – పెంపుపై చర్చించారు. డీడీ మాట్లాడుతూ భూగర్భ జలమట్టాలు 20 అడుగుల నుంచి 50 అడుగుల లోతుకు తగ్గిపోయాయని, ఇది ఆందోళన కలిగించే అంశమన్నారు. ఇక్కడ వ్యవసాయమంతా బోరుబావులపైనే ఆధారపడి జరుగుతోందన్నారు. ఏపీఎంఐపీ ఆధ్వర్యంలో వ్యవసాయం, తోటల పెంపకంలో డ్రిప్, స్ప్రింక్లర్ల వినియోగం పెరిగి నీటి వినియోగం తగ్గాలన్నారు. రీఛార్జి పిట్‌లు, ఫారంపాండ్స్, రింగ్ ట్రెంచ్‌లు, చెరువుల పూడిక తీత పనులు చేపట్టడం ద్వారా భూగర్భ జలాలను పెంచుకునే అవకాశం ఉందన్నారు. డ్వామా ఏపీడీ బి.రాంప్రసాద్ మాట్లాడుతూ ఐదేళ్ల కాలపరిమితిలో ప్రణాళిక బద్ధంగా ఈ పనులు చేపట్టి, పురోగతి సాధించవచ్చన్నారు. ఏపీఎంఐపీ పీడీ ఏ.దుర్గేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందుతున్న రైతులు రానున్న ఐదేళ్లలో తమ పొలాల్లో ఫారంపాండ్లు, రింగ్ ట్రెంచ్‌లు ఏర్పాటు చేసుకుని, భూమిలో తేమశాతం తగ్గకుండా జాగ్రత్త పడాలన్నారు. ఈ పనులన్నీ ఉపాధి హామీ పథకం ద్వారానే జరుగుతాయని వివరించారు. సమావేశంలో జిల్లా ఉద్యాన అధికారి మల్లికార్జునరావు, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ రత్నకుమారి, నీటిపారుదలశాఖ డీఈ మనోజ్ కుమార్, మండల పరిషత్ ఏఓ మహాలక్ష్మి మంగతాయారు, ఉద్యానశాఖ అధికారి బబిత, వ్యవసాయాధికారి సోమశేఖరం, ఏపీఓ త్రిమూర్తులు పాల్గొన్నారు.

కాటన్ బ్యారేజీకి తగ్గిన వరద ఉధృతి

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీకి వరద ఉధృతి బుధవారం మరింత తగ్గింది. ఉదయం నుంచి క్రమేపి తగ్గుతూ వచ్చి.. రాత్రి 8 గంటలకు 10.70 అడుగులకు చేరింది. అయితే ఎగువ ప్రాంతాల్లో నీటి మట్టాలు పెరుగుతుండటంతో మరో రెండు రోజుల పాటు కాటన్ బ్యారేజీ వద్ద నీటి ఉధృతి కొనసాగే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం కాళేశ్వరంలో 11.20 మీటర్లు, పేరూరులో 15.85 మీటర్లు, దుమ్ముగూడెంలో 11.57 మీటర్లు, భద్రాచలంలో 41.80 అడుగులు, కూనవరంలో 17.48 మీటర్లు, కుంటలో 9.40 మీటర్లు, పోలవరంలో 11.65 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 15.70 మీటర్ల నీటిమట్టాలు కొనసాగుతున్నాయి.

సైనికుడికి సెగ

- ఆధిపత్య పోరులో మర్రెడ్డి అధికారాలకు కత్తెర
- కోటరీలో చక్రం తిప్పిన ఎంపీ వర్గం
- ఫైవ్‌మెన్ కమిటీతో ఇన్‌చార్జికి చెక్
- పిఠాపురంలో పెరుగుతున్న కరివేపాకులు
- ఎన్నికలకే పరిమితమైన వర్మ ప్రాధాన్యం
- గద్దెనెక్కాక పక్కనపెట్టిన పవన్ సోదరులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఏ ముహూర్తాన పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రి అయ్యారో కాని అప్పటి నుంచి పిఠాపురంలో జనసేన ముఖ్య నేతల మధ్య సెగ రాజుకుంటూనే ఉంది. డిప్యూటీ సీఎం ఎలాగూ ఉండని పిఠాపురంపై పెత్తనం కోసం జనసేనలోని ఒకే సామాజికవర్గం నుంచి రెండు వర్గాలు నువ్వా, నేనా అనే స్థాయిలో కుమ్ములాడుకుంటున్నాయి. రచ్చకెక్కిన వీరి విబేధాలు ఇటీవల పవన్ వద్ద పంచాయతీకి వెళ్లాయి. ఒకరి పెత్తనాన్ని మరొకరు ఒకపట్టాన జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ ఆధిపత్య పోరు చివరకు పిఠాపురంలో పవన్ కనుసన్నల్లో అన్నీ తానై ఒంటిచేత్తో చక్రం తిప్పిన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్‌కు మంగళంపాడే వరకు వెళ్లింది. రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు అంటూ ఎవరూ ఉండరనేందుకు ఈ రెండు వర్గాల ముఖ్యనేతలే పెద్ద ఉదాహరణగా నేతలు విశ్లేషిస్తున్నారు. పవన్ పిఠాపురం నుంచి పోటీ చేస్తారనే ప్రచారం మొదలైన దగ్గర నుంచి ప్రస్తుత ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ తెర వెనుక అన్నీ తానై చక్కబెట్టారు. తాను ఎంపీగా పోటీ చేయాలనుకుని పిఠాపురానికి ఎటువంటి సంబంధం లేని ద్వారపూడికి చెందిన మర్రెడ్డి శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి అప్పగించడంలో తంగెళ్ల పావులు కదిపారు.



ఉదయ్ శ్రీనివాస్

తొలినాళ్లలో ఈ రెండు గ్రూపులు భాయ్‌భాయ్ అంటూ చెట్టాపట్టాలేసుకునే తిరిగాయి. ఎటొచ్చీ తంగెళ్ల ఎంపీ, పవన్ ఉప ముఖ్యమంత్రి కావడంతో పిఠాపురంపై పెత్తనం కోసం మర్రెడ్డి, తంగెళ్ల వర్గాల మధ్య అంతర్గత పోరు పలు సందర్భాల్లో రచ్చకెక్కింది.



మర్రెడ్డి శ్రీనివాస్



వర్మ

పిఠాపురం ఇన్‌చార్జిగా మర్రెడ్డి ఒంటెద్దు పోకడలతో ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని తొలి నుంచి ఎంపీ వర్గం బాహాటంగానే చెబుతోంది. నియోజకవర్గంలో తన కనుసన్నల్లోనే అంతా జరగాలనే స్థాయికి మర్రెడ్డి వచ్చేశారని పవన్ కల్యాణ్ వద్ద చెవిలో జోరీగలా పోరుపెడుతూనే వస్తున్నారని పార్టీలో చర్చ నడుస్తోంది. టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ వర్మతో మిలాఖత్ అయ్యి పార్టీ నేతలను తొక్కేస్తున్నారని రక్తికట్టించే కథ అల్లారని ఎంపీ తంగెళ్ల వర్గం పవన్‌కు చెబుతున్నారు. నియోజకవర్గ పార్టీలో జరుగుతున్న వ్యవహారాలపై ఇటీవల పార్టీ నేతలతో పవన్ మంగళగిరిలో భేటీ అయ్యారు. నమ్మి బాధ్యతలు అప్పగిస్తే ఇలానే వ్యవహరిస్తారా అంటూ మర్రెడ్డిపై ఒకింత అసహనం వ్యక్తం చేశారని పార్టీ నేతల మధ్య గుసగుసలు వినిపిస్తున్నాయి. మొత్తం మీద ఎంపీ వర్గం వ్యూహాత్మకంగా పావులు కదిపి మర్రెడ్డికి చెక్ పెట్టిందంటున్నారు. మర్రెడ్డి స్థానే నియోజకవర్గంలో పార్టీ నిర్వహణకు ఫైవ్‌మెన్ కమిటీ వేశారని చెబుతున్నారు. ఇప్పటి వరకు మర్రెడ్డి ఒక్కరే ఇన్‌చార్జిగా ఉండగా కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్సీ హరిప్రసాద్, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, మర్రెడ్డి శ్రీనివాస్‌లతో నియోజకవర్గ సమన్వయ కమిటీ ఏర్పాటుచేశారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఈ కమిటీ నియామకం ద్వారా మర్రెడ్డికి నియోజకవర్గ కార్యకలాపాల్లో ప్రాధాన్యం లేకుండా చెక్ పెట్టినట్టు స్పష్టమవుతోంది. ఇక ముందు సమన్వయ కమిటీదే తుది నిర్ణయమని, అధికారులు కూడా కమిటీ సభ్యులు చెప్పే పనులకు ఆమోదం తెలియచేయాలని మౌఖిక ఆదేశాలు కూడా వచ్చాయంటున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే పలు నామినేటెడ్ పోస్టులపై మర్రెడ్డి ఇన్‌చార్జిగా నిర్ణయం తీసుకుని ప్రతిపాదించిన వాటిని వెనక్కు తీసుకోవడం ద్వారా మర్రెడ్డికి ప్రాధాన్యం లేదనే విషయం ప్రచారం చేయాలనే యోచనలో ఎంపీ వర్గం పావులు కదుపుతోంది. నియోజకవర్గంలో 12 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు 8 జనసేన, 4 టీడీపీకి ఇప్పటికే పంపకాలు జరిగిపోయాయి. అయినా వాటన్నింటినీ ఎక్కడివక్కడే ఆపేయాలని నిర్ణయించారని పార్టీలో విస్తృత ప్రచారం జరుగుతోంది. పవన్ గెలుపు కోసం పనిచేసిన వారిని జనసేనలో కరివేపాకుల్లా వాడుకుని గాలికి వదిలేస్తారని ఇదంతా చూస్తుంటే అర్థమవుతోందని పార్టీ నేతల మధ్య ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఇందుకు టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ వర్మ ఉదంతాన్ని గుర్తుచేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలు అయ్యేంత వరకు పిఠాపురం సీటును త్యాగం చేసిన వర్మను పవన్, అతని సోదరుడు ఎమ్మెల్సీ నాగబాబు ఆకాశానికి ఎత్తేసేవారు. ఎన్నికలు పూర్తయ్యి కూటమి గద్దె నెక్కి పవన్ ఉప ముఖ్యమంత్రి, నాగబాబు ఎమ్మెల్సీ అయిపోగానే సోదర ద్వయం వర్మను కరివేపాకులా పక్కన పడేశారని పార్టీ నేతలు గుసగుసలాడుకుంటున్నారు. వర్మకు పదవి ఇవ్వాలా వద్దా అనేది ఆ పార్టీ అధిష్టానం చూసుకుంటుందనే సరికొత్త ప్రచారాన్ని తెరమీదకు తీసుకువచ్చారు. ఇప్పుడు 14 నెలల పాటు పార్టీ కోసం పనిచేసిన తమ నేతను కూడా వర్మ మాదిరిగానే కరివేపాకులా తీసిపారేశారని మర్రెడ్డి వెంట తిరిగిన పార్టీ నేతలు మండిపడుతున్నారు. పవన్ ఇలాకా పిఠాపురం జనసేనలో రాజుకున్న ఈ కుంపటి ఎటువంటి పరిణామాలకు దారితీస్తుందోననే చర్చ పార్టీలో జోరుగా సాగుతోంది.

నాస్కామ్‌తో జేఎన్‌టీయూకే ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వీసీ ప్రసాద్, నాస్కామ్ డైరెక్టర్ ఉదయ్‌శంకర్

బాలాజీచెరువు (కాకినాడ): ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్ ఇనిషియేషన్ అమలు చేసేందుకు జేఎన్‌టీయూ కాకినాడ, నాస్కామ్ మధ్య బుధవారం ఒప్పందం జరిగింది. స్టూడెంట్ అఫైర్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎ.కృష్ణమోహన్ అధ్యక్షతన వీసీ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్, నాస్కామ్ డైరెక్టర్ ఉదయ్‌శంకర్ ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, ప్రొఫెసర్ నైపుణ్యాలు, వర్చువల్ ఇంటర్న్‌షిప్‌లు, హ్యాకథాన్, పరిశ్రమ లీడర్ సెషన్ కోర్సులు ఉచితంగా అందజేస్తామని వీసీ తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులలో డిజిటల్ నైపుణ్యాలను శక్తివంతమవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెక్టార్ వీవీ సుబ్బారావు, ఓఎస్‌డీ కోటేశ్వరరావు, డైరెక్టర్లు సహదేవయ్య, బీటీ కృష్ణ, స్వర్ణకుమారి, పద్మజారాణి పాల్గొన్నారు.

రత్నగిరిపై 30 శాతం భక్తుల అసంతృప్తి

జూలై 26 నుంచి ఆగస్టు 25 వరకు
వాట్సాప్ యాప్, ఐవీఆర్ఎస్ సర్వే

అన్నవరం: రత్నగిరికి వచ్చే భక్తుల అసంతృప్త స్థాయి అంతకంతకూ పెరుగుతోందే తప్ప తగ్గడం లేదు. భక్తు సేవలందించడంలో ఆగష్టు నెలలో కూడా దేవస్థానం పాలకవర్గం విఫలమైనట్టు రాష్ట్ర ప్రభుత్వ సర్వేలో వెల్లడైంది. ఆగస్టు నెలలో సత్యదేవుని సన్నిధికి వచ్చే భక్తుల్లో దాదాపు 30 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారు. గత జూలై 26 నుంచి ఆగస్టు 25వ తేదీ వరకు రాష్ట్రంలోని ఏడు ప్రముఖ దేవస్థానాలలో భక్తులకు అందుతున్న సేవలపై రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్, ఐవీఆర్ఎస్ ద్వారా సర్వే నిర్వహించింది. సింహాచలం, అన్నవరం, ద్వారకాతిరుమల, విజయవాడ, శ్రీకాళహస్తి, శ్రీశైలం, కాణిపాకం దేవస్థానాలలో నిర్వహించిన సర్వేలో శ్రీకాళహస్తి ప్రథమస్థానంలో నిలవగా అన్నవరం దేవస్థానం ఐదో స్థానంలో నిలిచింది. కాగా కాణిపాకం ఏడో స్థానంలో నిలిచింది.

భక్తుల సంతృప్తి శాతం ఇలా..

- సత్యదేవుని దర్శనం విషయంలో జూన్ నెలలో 73 శాతం మంది, జూలై నెలలో 74 శాతం, ఆగస్టులో 75.8 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు.
- మౌలిక వసతుల కల్పనలో జూన్‌లో 66 శాతం, జూలైలో 65 శాతం, ఆగస్టులో లో 64.9 శాతం సంతృప్తి వ్యక్తం చేశారు.



శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం, అన్నవరం

- స్వామివారి గోదుమ నూక ప్రసాదం నాణ్యతపై జూన్‌లో 77 శాతం, జూలైలో 78 శాతం, ఆగస్టులో 76.9 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు.
- పారిశుధ్య చర్యలలో జూన్‌లో 70 శాతం, జూలైలో 68 శాతం, ఆగస్టులో 66.5 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు.

దసరా, కార్తికమాసాల నాటికి చక్కదిద్దాలి

ఈ నెల 22 నుంచి ఆశ్వయుజ మాసం ప్రారంభమవుతోంది. ఆ రోజు నుంచి పది రోజుల పాటు దసరా నవరాత్రులలో భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. అలాగే అక్టోబర్ 22 నుంచి కార్తికమాసం రద్దీ ఉంటుంది. ఈ లోపుగా దేవస్థానంలో భక్తుల అసంతృప్తి తగ్గేలా ఏర్పాట్లు చేయాల్సి ఉంది.

ముగ్గురు ఉపాధ్యాయులకు ఉత్తమ పురస్కారం

కాకినాడ రూరల్: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఏటా నిర్వహించే ఉత్తమ ఉపాధ్యాయ దినోత్సవానికి జిల్లా నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు ఉత్తమ పురస్కారాలకు ఎన్నికయ్యారు. కాకినాడకు చెందిన కోటంరాజు గాయత్రి మూడు దశాబ్దాల పాటు చేసిన విద్యా సేవకు ఈ పురస్కారం దక్కింది. ఆమె ఎటువంటి దరఖాస్తు చేసుకోనప్పటికీ లీప్ యాప్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆమె ప్రతిభను గుర్తించి పురస్కారానికి ఎంపిక చేసింది. ఇంద్రపాలెంలో నివసిస్తున్న గాయత్రి కాకినాడ రూరల్ రమణయ్యపేటలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్‌లో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. పాఠశాలను పీఎం శ్రీ పాఠశాలగా తయారు చేసి ఐదు ల్యాబ్‌లను, ప్లే ఫీల్డ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఆమె కృషి చేశారు. తుని మండలం తేటగుంట జెడ్పీ హైస్కూల్‌లో 1995 జూన్ 29న ఉపాధ్యాయినిగా తన వృత్తిని ప్రారంభించి, 2009లో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయినిగా పదోన్నతి పొందారు. 2014లో జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయినిగా పురస్కారం అందుకున్నారు. తేటగుంట, పెదపూడి మండలం ఎల్ఎస్‌పురం, కాకినాడ అర్బన్ పీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో సోషల్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేశారు. గెజిటెడ్ హెచ్‌ఎంగా కిర్లంపూడి మండలం సోమవరం, పెద్దాపురం మండలం చంద్రమాంపల్లిలో పని చేసి, 2023 నుంచి రమణయ్యపేటలో పని చేస్తున్నారు. రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికైన గాయత్రిని డీఈఓ రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.



గాయత్రి

కొమరగిరి నుంచి రవిశంకర్

కొత్తపల్లి: రాష్ట్రస్థాయి ఉత్తమ పురస్కారాలు అందుకున్న వారిలో కొత్తపల్లి మండలం ఉప్పాడలోని కొమరగిరి జెడ్పీ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు పతివాడ రవిశంకర్ ఒకరు. గణిత అవధానిగా, పాఠ్య పుస్తక రచయితగా, మాడ్యూల్ రైటర్గా, స్టెమ్ ల్యాబ్ డిజైనర్‌గా పలు విద్యా సేవలు అందించడంలో ఆయన ఎంతో పేరు తెచ్చుకున్నారు. ఏలేశ్వరం స్పోర్ట్స్ అండ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్, స్నేహస్తం, చేయూత, లయన్స్ క్లబ్ కాకినాడ ఎలైట్ వంటి స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా సైతం ఆయన సామాజిక సేవ చేస్తున్నారు. గత మూడేళ్లుగా జాతీయస్థాయిలో గణిత అభ్యసన సామగ్రితో పురస్కారాలు అందుకుంటున్నారు. బోధన అభ్యసన సామగ్రి తయారు చేయడం, వాటిని ఎలా తయారు చేయాలి.. ఎలా ఉపయోగించాలనే అంశాలపై వర్క్ షాపులు నిర్వహించడం చేస్తున్నారు.



పెరుమాళ్లపురం స్కూల్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్



ప్రవీణ్‌కుమార్

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం జెడ్పీ హైస్కూలు ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ బొబ్బాది ప్రవీణ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికైనట్టు ఆ పాఠశాల హెచ్‌ఎం చాట్రాతి సత్యనారాయణ బుధవారం తెలిపారు. గతంలో పాఠ్య పుస్తక రచయితగా, ఉత్తమ టీఎల్ఎం నిపుణుడిగా, ట్రెనింగ్ రీసోర్స్ పర్సన్‌గా ఆయన ఎన్నో అవార్డులు పొందారన్నారు. అంతే కాకుండా విద్యార్థులకు ఆటల పాటల ద్వారా వినూత్నంగా విద్యా బోధన చేస్తున్నారు. గణిత క్రికెట్, గణిత హౌసి, టేబుల్ అంత్యాక్షరి, మ్యాజిక్ స్క్వేర్ డాన్స్ వంటి అనేక వినూత్న విధానాలతో పిల్లల ఆకట్టుకోవడమే కాక సైన్స్ ఫెయిర్లకు పిల్లలను రాష్ట్రస్థాయిలో బహుమతులు అందుకునేలా చేశారు.

ఎన్ఎంఎంఎస్, ఐఐఐటీలలో సీట్లు పొందడంలో విద్యార్థులకు అండగా నిలిచారు. అంతే కాకుండా విద్యార్థులకు విజ్ఞాన, విహారయాత్రలే కాక సేవను కూడా అలవాటు చేసే లక్ష్యంతో లియో క్లబ్‌లను ఏర్పాటు చేసి సేవపై అంకితభావాన్ని తెలియజేశారు. ఏపీఎంఎఫ్ బాధ్యుడిగా ఉంటూ గణిత ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటూ తనకు తోచిన విషయాన్ని నలుగురికి తెలియజేస్తూ వాళ్ల దగ్గర నుంచి తెలియని విషయాన్ని నేర్చుకుంటూ గణిత సేవలో నిమగ్నమయ్యారు.

చీకట్లో ఆశా కిరణం

- మరణం తర్వాత నేత్రదానంతో చూపు సజీవం
- ఒకరి ద్వారా ఇద్దరు అంధులకు వెలుగు
- ఈ నెల 8 వరకు నేత్రదాన పక్షోత్సవాలు



రాయవరం: సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు పెద్దలు. అందమైన ప్రపంచాన్ని చూడాలంటే కంటిచూపు సక్రమంగా ఉండాలి. మరణానంతరం ఈ సృష్టిని చూసే అవకాశం ఉండాలంటే నేత్రదానమే ఏకైక మార్గం. వివిధ రోడ్డు ప్రమాదాలు, అనారోగ్యాలు, సహజ మరణంతో నిత్యం ఎంతో మంది మరణిస్తున్నారు. చనిపోయిన వ్యక్తి నేత్రదానంతో ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగు నింపవచ్చు. నేత్రదానం ద్వారా వ్యక్తి మరణించినా అతని కళ్లు జీవించే ఉంటాయి. చనిపోయిన వ్యక్తి వేరొకరి ద్వారా ప్రపంచాన్ని చూస్తూనే ఉంటాడు. అంధులకు కార్నియా ఆపరేషన్ల ద్వారా కంటిచూపును ప్రసాదించవచ్చు. అంతటి ప్రాముఖ్యమున్న నేత్రాలను సంరక్షించుకోవడం, అంధత్వాన్ని నియంత్రించడంలో జాగ్రత్తలను సూచిస్తూ ఏటా ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు.

'ఐ'న వాళ్లమవుతాం

కళ్లు లేని ఓ చిన్నారికి అమ్మను చూపించగలదు. లోకం చూడలేని వారికి రంగులు చూపగలదు. చీకటి తప్ప ఇంకేమీ తెలియని బతుకుల్లో వెలుగులు నింపగలదు. కాసింత మానవత్వం ఉంటే చాలు.. నేత్రదానంతో దాతలు అందరికీ 'ఐ'న వాళ్లమవుతారు. అంధత్వాన్ని సమూలంగా నిర్మూలించగలరు. ఇటీవల కాలంలో నేత్రదానం, రక్తదానం, అవయవ దానంపై అధిక ప్రచారం సాగుతోంది. నేత్ర సేకరణ కేంద్రం ద్వారా జిల్లాలో కార్నియాలను సేకరిస్తున్నారు.

విస్తృత అవగాహన

మరణించిన తర్వాత నేత్రాలు వృథాగా మట్టిలో కలిసిపోకుండా,. మంటల్లో కాలిపోకాకుండా.. ప్రజల్లో నేత్రదానంపై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రెడ్‌క్రాస్ ఐ-బ్యాంక్, బాదం బాలకృష్ణ ఐ-బ్యాంక్, జిల్లా అంధత్వ నివారణ సంస్థతో పాటు, పలు స్వచ్ఛంద సంస్థలు విస్తృత అవగాహన కల్పిస్తున్నాయి. దీంతో జిల్లాలో వందలాది మంది మరణానంతరం నేత్రదానం చేసి పలువురికి చూపును ప్రసాదించారు. వేలాది మంది తమ మరణానంతరం నేత్రదానం చేస్తామని అంగీకారం సమర్పించి, డోనర్ కార్డులు పొందుతున్నారు. గతేడాది సెప్టెంబర్ నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 636 కార్నియాలు సేకరించగా, 263 మందికి కార్నియాలను అమర్చారు.

అంధత్వం రాకుండా..

మెల్లకన్ను, విటమిన్-ఏ లోపం, రెటీనా వ్యాధులు, శుక్లాలు, కార్నియాపై తెల్లటి మచ్చలు, కంటికి దెబ్బ తగలడం తదితర కారణాల ద్వారా అంధత్వం వస్తుంది. చదువుకునే చిన్నారులు బ్లాక్ బోర్డు కనిపించడం లేదంటే, తక్షణమే కంటి వైద్యుడిని సంప్రదించటం ద్వారా సమస్యను నివారించవచ్చు. కంటిచూపు బాగుండాలంటే పోషకాహారం తీసుకోవాలి. మధుమేహ బాధితులు తరచూ కంటి పరీక్షలు చేయించుకోవాలి.

ఆరు గంటల్లోగా కార్నియా సేకరణ

వ్యక్తి నుంచి సేకరించిన కార్నియాను సరైన పద్ధతిలో 14 రోజులు మాత్రమే భద్రపర్చవచ్చు. తర్వాత అవి ఉపయోగపడవు. అలాంటి కార్నియాలను ఆప్తమాలజీ వైద్య విద్యార్థుల బోధనకు వినియోగిస్తారు. ఐ-బ్యాంక్‌లు మానవ అవయవ మార్పిడి చట్ట పరిధిలోకి వస్తాయి. నేత్రదానం చేసే వారికి ప్రాణాంతక అనారోగ్య సమస్యలు ఉండరాదు. వ్యక్తి మరణించిన ఆరు గంటల్లోగా కార్నియాను సేకరించాలి. ఐ బ్యాంక్ డాక్టర్, శిక్షణ పొందిన టెక్నీషియన్ మాత్రమే స్టెరైల్ పద్ధతిలో అర గంటలో కార్నియాను సేకరిస్తారు. నేత్ర దాత మరణిస్తే, మృతదేహం ఉన్న గదిలో ఫ్యాన్లు ఆపేయాలి. ఫ్రీజర్ బాక్స్‌లో మృతదేహాన్ని భద్రపరిచి, నేత్రాలను సేకరించే వైద్యులు, స్వచ్ఛంద సంస్థలకు సమాచారమివ్వాలి. బీపీ, సుగర్ ఉన్నా నేత్రదానం చేయవచ్చు.




అంధత్వ నివారణకు కృషి



బాదం బాలకృష్ణ ఐ-బ్యాంక్‌ను 2006లో ప్రారంభించాం. తూర్పుగోదావరి, పరిసర జిల్లాల్లో అంధుల జీవితాల్లో వెలుగు నింపాలనే ఉద్దేశంతో 19 మందితో దీనిని స్థాపించి అంధత్వ నివారణకు కృషి చేస్తున్నాం. ఇప్పటివరకు 7,584 కార్నియాలు సేకరించాం. మరణించిన వారి నేత్రాలను దానం చేసేలా కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ చేస్తున్నాం.

– డాక్టర్ బాదం బాలకృష్ణ, ఐ-బ్యాంక్, కాకినాడ

సమాజ సేవలో రెడ్‌క్రాస్



రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా రెడ్ క్రాస్ ఐ-బ్యాంక్‌ను ప్రారంభించాం. గతేడాది జనవరి 31న ప్రారంభించగా, మార్చి నుంచి కార్నియాలు సేకరిస్తున్నాం. ఇప్పటి వరకు 248 కార్నియాలు సేకరించాం. మరణానంతరం నేత్రాలు, అవయవాలు వృథా పోనీయకుండా ప్రజల్లో మరింత అవగాహన పెంచేందుకు రెడ్‌క్రాస్ ద్వారా కృషి చేస్తున్నాం.

– వైడీ రామారావు, చైర్మన్, రెడ్‌క్రాస్ ఐ-బ్యాంక్, కాకినాడ

ప్రజల్లో స్పందన



జిల్లాలో అంధత్వ నివారణకు విస్తృత చర్యలు తీసుకుంటున్నాం. నేత్రదానంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. మరింతగా అవగాహన పెరగాల్సి ఉంది. మరణానంతరం నేత్రదానం చేస్తే ఇద్దరికి చూపును ప్రసాదించవచ్చు. ప్రజల్లో కూడా నేత్రదానంపై స్పందన వస్తోంది.

– డాక్టర్ శ్రీవిద్య, ప్రోగ్రాం మేనేజర్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కాకినాడ

క్లుప్తంగా

విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి భూమిపూజ



విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కృష్ణంరాజు దంపతులు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీరవేంకట సత్యనారాయణ స్వామివారి ఆలయం పశ్చిమ రాజగోపురం వద్ద రూ.2.5 కోట్ల వ్యయంతో నిర్మించనున్న విశ్రాంతి షెడ్డుకు బుధవారం భూమిపూజ జరిగింది. విశాఖపట్నానికి చెందిన లారెస్ ఫార్మాస్యూటికల్ సంస్థ ఎండీ ఎంవీవీఎస్ కృష్ణంరాజు దంపతులు భూమిపూజ చేశారు. భక్తుల కోసం లారెస్ సంస్థ ఈ షెడ్డు నిర్మిస్తుంది. కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు, ఈఈ వి.రామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చీటీల పేరుతో మోసం

- రూ.2.39 కోట్లు స్వాహా
- ఇద్దరు నిందితుల అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

పిఠాపురం: చిట్ ఫండ్ కంపెనీ పేరుతో రూ.2.39 కోట్లు స్వాహా చేసిన నిందితులను బుధవారం అరెస్టు చేసినట్టు పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ తెలిపారు. ఆయన వివరాల మేరకు, పిఠాపురానికి చెందిన కొర్ర సత్యనారాయణ, పక్కుర్తి వరహాలరావు, లోకారెడ్డి భాస్కరరావు కలిసి 2014లో శ్రీసత్య శివాని చిట్‌ఫండ్ కంపెనీని పట్టణంలో మొదలుపెట్టారు. వీరు సభ్యులను చేర్చుకుని, రూ.5 లక్షలు, రూ.10 లక్షలు, రూ.20 లక్షల చీటీలు నిర్వహించారు. రెండేళ్ల క్రితం చీటీలు పాడుకున్న 94 మందికి డబ్బు చెల్లించకుండా మోసం చేశారు. దీంతో బాధితులు అసిస్టెంట్ జిల్లా రిజిస్ట్రార్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. ప్రాథమిక విచారణ అనంతరం, అసిస్టెంట్ జిల్లా రిజిస్ట్రార్ సునంద గతేడాది నవంబర్ 29న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు, దర్యాప్తు చేసి 94 మందిని బాధితులుగా గుర్తించారు. నిందితులు కొర్ర సత్యనారాయణ, లోకారెడ్డి భాస్కరరావును బుధవారం అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు. మరికొందరు నిందితులను అరెస్టు చేయాల్సి ఉందన్నారు.

స్ప్రేయర్ మొరాయిస్తే.. ఫియరే..!

- పరికరాలను భద్రపర్చాలంటున్న వ్యవసాయ నిపుణులు
- నెలల తరబడి వదిలేస్తే.. మొండికేసే అవకాశం
- డబ్బు, సమయం వృథా
- చిన్న జాగ్రత్తలతో రైతులకు మేలు



కేవీఎన్ రమేష్‌కుమార్

రాయవరం: పంటలకు ఆశించిన చీడపీడల నివారణకు మందులు పిచికారీ చేయడానికి రైతులు రకరకాల స్ప్రేయర్లను వినియోగిస్తుంటారు. ప్రస్తుతం ఖరీఫ్ పంటలకు ఆశిస్తున్న తెగుళ్ల నివారణకు పురుగు మందులను పిచికారీ చేసే పనిలో నిమగ్నమయ్యారు. పంట కాలంలో వాటితో పని ముగియగానే అలాగే వదిలేస్తారు. తర్వాత పంట కాలంలో అవసరం రాగానే స్ప్రేయర్లను మళ్లీ వినియోగించేందుకు యత్నిస్తే.. చాలావరకు మొరాయిస్తుంటాయి. అప్పుడు స్ప్రేయర్లను తీసుకుని మెకానిక్ షెడ్లకు పరుగులు పెట్టడం సర్వసాధారణం. డబ్బు వెచ్చించి రిపేరు చేయించడం కన్నా, చిన్న జాగ్రత్తలు తీసుకుంటే వృథా ఖర్చులు తగ్గడంతో పాటు, స్ప్రేయర్లు ఎక్కువ కాలం మన్నికగా ఉంటాయి. ప్రస్తుతం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కాండం తొలుచు పురుగు ఆశించడంతో రైతులంతా పురుగు మందుల పిచికారీలో నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో స్ప్రేయర్లను భద్రపర్చే విధానాన్ని మండల వ్యవసాయాధికారి కేవీఎన్ రమేష్‌కుమార్ వివరించారు.



స్ప్రేయర్‌తో మందు చల్లుతున్న రైతులు

పవర్ స్ప్రేయర్

మందుల పిచికారీ సమయం ముగియగానే మంచి నీటితో శుభ్రం చేయాలి. ట్యాంకులో పెట్రోలు లేకుండా చూసుకోవాలి. టర్బోరేటర్ గిన్నెలోనూ పెట్రోలు లేకుండా చూడాలి. ప్లగ్ తీసి శుభ్రంగా పెట్రోల్‌తో కడగాలి. పిస్టన్‌పై 5–6 చుక్కల ఇంజినాయిల్ వేసి ప్లగ్‌ను బిగించాలి. ఇలా చేస్తే పిస్టన్ పాడై పోకుండా ఉంటుంది. మళ్లీ అవసరం వచ్చినప్పుడు వెంటనే స్టార్ట్ అవుతుంది.

తైవాన్

ట్యాంకులో ఐదు లీటర్ల మంచినీరు పోయాలి. ఇంజిన్ స్టార్ట్ చేసి నాజిల్ ద్వారా బయటకు పంపాలి.

పాడి-పంట

ఇలా చేయడం వల్ల పైపుతో పాటు, నాజిల్‌లో మలినాలు లేకుండా శుభ్రమవుతుంది. ట్యాంకులో పెట్రోలు లేకుండా తీయాలి. ప్లగ్‌ను తీసి పిస్టన్‌పై ఐదారు చుక్కల ఇంజినాయిల్ వేసి ప్లగ్ బిగించాలి. పంపు భాగాలన్నింటినీ శుభ్రంగా తుడిచి భద్రపర్చుకోవాలి.

రీచార్జబుల్..

పనులు పూర్తయిన వెంటనే మూడు లీటర్ల నీటిని ట్యాంకులో పోసి బయటకు పంపాలి. ప్రతి 15 రోజులకు ఓసారి గంట పాటు చార్జింగ్ పెట్టాలి. ఇలా చేయడం వల్ల బ్యాటరీ డ్రెయిన్ కాకుండా ఉంటుంది. అన్నదాతలు ఆయా విషయాలు పాటించి తమ పంపు స్ప్రేయర్లను భద్రపర్చుకోవచ్చు.



స్ప్రేయర్ పరికరం

ఏడాది తర్వాత తీసినా..

మందుల పిచికారీ పూర్తి కాగానే శుభ్రమైన నాలుగు లీటర్ల మంచినీటిని ట్యాంకులో పోసి నాజిల్ ద్వారా బయటకు పంపాలి. తద్వారా స్ప్రేయర్ గొట్టం(ఇత్తడి) తీసి, దానికి ఇంజినాయిల్ పోసి మళ్లీ బిగించాలి. ఇలా చేస్తే గొట్టం తుప్పు పట్టకుండా ఉంటుంది. బుష్‌లు, రాడ్ల వద్ద ఇంజినాయిల్ పూయడం వల్ల తుప్పు రాకుండా ఉంటుంది. ఏడాది తర్వాత తీసి వాడినా బాగా పనిచేస్తుంది.

హైటెక్..

ట్యాంకులో మూడు లీటర్ల నీటిని పోసి శుభ్రంగా నాజిల్ ద్వారా బయటకు పంపాలి. తర్వాత స్ప్రేయర్ గొట్టం తీసి దానికి ఇంజినాయిల్ పోసి మళ్లీ బిగించాలి. ఇలా చేస్తే గొట్టం తుప్పు పట్టకుండా ఉంటుంది. బుష్‌లు, రాడ్ల వద్ద ఇంజినాయిల్ పూయడం వల్ల తుప్పు పట్టదు.

తల్లిదండ్రులు మందలించారని విద్యార్థిని ఆత్మహత్య



కనిగిరి వరలక్ష్మీ అపర్ణ (ఫైల్)

శంఖవరం: చదువుపై దృష్టి సారించడం లేదని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం చెందిన బాలిక ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానిక కృష్ణాలయం వీధిలో కనిగిరి వరలక్ష్మీ అపర్ణ(16) మంగళవారం రాత్రి ఈ ఘాతుకానికి ఒడిగట్టింది. అన్నవరం అడిషనల్ ఎస్సై ఎల్ ప్రసాద్ వివరాల మేరకు, స్థానిక ఆదర్శ పాఠశాలలో అపర్ణ ఇంటర్మీడియెట్ ఫస్టియర్ చదువుతోంది. ఎప్పటిలాగే మంగళవారం కళాశాలకు వెళ్లొచ్చిన ఆమె ఇంటి వద్ద చదువుపై దృష్టి పెట్టలేదు. ఈ క్రమంలో ఆమె తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన అపర్ణ తన తల్లిదండ్రులు పడుకున్నాక, ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. నిర్జీవంగా ఉన్న కుమార్తెను చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అపర్ణ మృతికి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు విచారం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పోలీసులు తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు అడిషనల్ ఎస్సై ప్రసాద్ తెలిపారు.

వివాదాస్పద ఫ్లెక్సీలపై చర్యలకు డిమాండ్

పోలీస్ స్టేషన్ వద్ద దళితుల ఆందోళన

మామిడికుదురు: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో వివాదాస్పద వ్యాఖ్యలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలు దళిత సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. అప్పనపల్లిలో వివాదాస్పద ఫ్లెక్సీ ఏర్పాటు నేపథ్యంలో బుధవారం నగరం పోలీస్ స్టేషన్ వద్ద వారు ఆందోళన నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, సినీ నటుల అభిమాన సంఘాలు ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీల్లో నాయకులు, హీరోల పేర్లలో బాబు సీమ, కల్యాణ్ సీమ అని అన్వయించుకోవడం వివాదాలకు కారణమవుతోందన్నారు. ఈ వ్యాఖ్యలు కొన్ని కులాలను కించపర్చేలా, రెచ్చగొట్టేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తరహా ఫ్లెక్సీలు ప్రింటింగ్ చేస్తున్న వారిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్సై ఎ.చైతన్యకుమార్, తహసీల్దార్ పి.సునీల్ కుమార్‌కు వినతిపత్రాలు ఇచ్చారు. అంబేడ్కర్ యువజన సంక్షేమ సంఘం, ఎమ్మార్పీఎస్, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



నగరం పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న దళిత సంఘాల ప్రతినిధులు

కుల విద్వేషాలను రెచ్చగొట్టొద్దు: సీపీఎం

అమలాపురం టౌన్: జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా మామిడికుదురు మండలం అప్పనపల్లిలో కులవిద్వేషాలను రెచ్చగొట్టేలా ఫ్లెక్సీ పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా సీపీఎం కార్యాలయంలో పార్టీ నాయకులు బుధవారం సమావేశమై దీనిపై చర్చించారు. ఈ ఫ్లెక్సీ వేయించిన వారిపై, ముద్రించిన షాపుపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దుశ్చర్యలు పునరావృతం కాకుండా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాలని కోరారు. పార్టీ నాయకులు జి.దుర్గాప్రసాద్, పీతల రామచంద్రరావు, జిల్లా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కన్వీనర్ శెట్టిబత్తుల తుల సీరావు తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడి కన్నుమూత



వెంకటరత్నం (ఫైల్)

మామిడికుదురు: బి.దొడ్డవరం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు వాకపల్లి వెంకటరత్నం (100) మంగళవారం రాత్రి కన్నుమూశారు. ఆయనకు ఆరుగురు కుమార్తెలు, కుమారుడు సంతానం. 18 మంది మనవలు, 28 మంది ముని మనవలు, పది మంది అని మనవలు ఉన్నారు. మరణించే వరకు ఆయన పనులు స్వయంగా చేసుకునేవారని కుటుంబ సభ్యులు తెలిపారు. మరణానికి నాలుగు రోజుల ముందు ఆరోగ్య సమస్యలు ఏర్పడి కన్నుమూశారని కుటుంబ సభ్యులు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి



కృష్ణంపాలెం వద్ద ప్రమాదానికి గురైన మేజిక్ వాహనం

దేవరపల్లి: వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. మండలంలోని కృష్ణంపాలెం వద్ద గుండుగొలను–కొవ్వూరు జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టాటా మేజిక్ డ్రైవర్ నాని(28) మృతి చెందగా, వాహనంలో ఉన్న ముగ్గురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స కోసం గోపాలపురం ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యానికి రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించారు. కృష్ణంపాలెం వద్ద ముందు వెళుతున్న లారీని కంటైనర్ ఢీకొంది. అదే సమయంలో డ్యాన్సర్లతో వస్తున్న టాటా మేజిక్ వెనుక నుంచి కంటైనర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం అజ్జరానికి చెందిన డ్రైవర్ నాని(28) మృతి చెందగా, డ్యాన్సర్లు చరణ్ ఢిల్లీరావు, హరిసంతోష్, కరిష్మా తీవ్రంగా గాయపడ్డారు. విశాఖపట్నం నుంచి నెల్లూరుకు ప్రోగ్రాం కోసం 8 మంది వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుడు నాని కూడా డ్యాన్సరేనని కుటుంబ సభ్యులు తెలిపారు. అతడికి ఇటీవల నిశ్చితార్థమైంది. రెండు నెలల్లో వివాహం కావాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గోపాలపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వి.సుబ్రహ్మణ్యం తెలిపారు.



డ్రైవర్ నాని(ఫైల్)

కుమార్తెను చూసేందుకు వెళ్తూ..

అయినవిల్లి: సడన్ బ్రేక్ వేయడంతో ఆటో తిరగబడిన ప్రమాదంలో ప్రయాణికుడు మృతి చెందాడు. ఎస్సై హరికోటిశాస్త్రి వివరాల ప్రకారం, బుధవారం చింతనలంక చిన రామాలయం వీధికి చెందిన గోసంగి తనుకులు(75) ఉప్పలగుప్తం మండలం చల్లపల్లిలోని తన కుమార్తెను చూసేందుకు బయలుదేరాడు. ముక్తేశ్వరంలో ఆటో ఎక్కి అమలాపురం వెళ్తుండగా, రావిగుంట చెరువు వద్ద ఆటోడ్రైవర్ అతివేగంగా వెళ్తూ సడన్ బ్రేక్ వేశాడు. ఆటో బోల్తా పడడంతో తనుకులు రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. అతడి కుమారుడు అంజి కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

వర్షంలో ప్రయాణిస్తూ..

అమలాపురం టౌన్: కిమ్స్ ఆస్పత్రి సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వడ్రంగి మేస్త్రీ మరణించాడు. పట్టణ ఎస్సై ఎస్ఆర్ కిషోర్‌బాబు వివరాల మేరకు, అమలాపురం రూరల్ మండలం భట్నవిల్లి గ్రామానికి చెందిన వడ్రంగి మేస్త్రీ గోడ ఫణికుమార్(32) వర్షం కురుస్తున్న సమయంలో స్కూటీపై వెళుతున్నాడు. అమలాపురం వైపు వస్తున్న ట్రాక్టర్ అతడిని వెనుక నుంచి ఢీకొంది. మరో బైకిస్టును కూడా ట్రాక్టర్ ఢీకొట్టడంతో అతనూ గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఫణికుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కిషోర్‌బాబు తెలిపారు.

భర్త దూరమయ్యాడని.. తానూ తిరిగిరాని లోకానికి..

- రెండేళ్ల బిడ్డతో తల్లి ఆత్మహత్య
- జూలైలో భర్త బలవన్మరణం



భర్త గోపి, బిడ్డతో ఆకాంక్ష (ఫైల్)

కాకినాడ రూరల్: సాఫీగా సాగే వారి పచ్చని సంసారాన్ని అప్పుల సుడిగుండం ముంచేసింది. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న రెండేళ్ల మగ బిడ్డకు పుట్టిన రోజును స్తోమతకు మించి ఘనంగా చేశారు. ఆ అప్పు భారంగా మారడంతో, ఈ ఏడాది జూలై నెలలో భర్త బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఒకటిన్నర నెలలు తిరక్కుండానే బిడ్డతో కలిసి భార్య ఆత్మహత్యకు పాల్పడడంతో ఆ కుటుంబానికి విషాదాంతమే మిగిలింది. సర్పవరం పోలీసుల వివరాల మేరకు, కాకినాడ రూరల్ సర్పవరం గ్రామంలోని భావనారాయణపురం గాంధీనగర్‌కు చెందిన జనపల్లి ఆకాంక్ష(25) తన బిడ్డ సార్విక్(2)కు పురుగు మందు పట్టించి, తాను ఆత్మహత్యాయత్నం చేసుకుంది. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. కరప మండలం గురజనాపల్లికి చెందిన ఆకాంక్షకు, సర్పవరం గ్రామానికి చెందిన జనపల్లి గోపితో మూడేళ్ల క్రితం వివాహమైంది. కాకినాడ నగరపాలక సంస్థ పారిశుద్ధ్య విభాగంలో కాంట్రాక్ట్ వర్కర్‌గా గోపి పనిచేసేవాడు. జూలైలో బిడ్డ సార్విక్ రెండో పుట్టిన రోజును ఘనంగా జరిపారు. ఇందుకు రూ.3 లక్షల వరకు అప్పులయ్యాయి. అప్పు ఇచ్చినవారి ఒత్తిడిని తట్టుకోలేక గోపి జూలై 22న మద్యంలో పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో ఆకాంక్ష మానసికంగా కుంగిపోయింది. కొన్ని రోజులు పుట్టింటి వద్ద, కొంతకాలం అత్తింటి వద్ద ఉండేది. భర్తపై బెంగతో గత నెల 31న మధ్యాహ్నం సర్పవరంలోని ఇంట్లో సోడాలో పురుగు మందు కలిపి బిడ్డకు పట్టించి, తాను తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు వారిని కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున ఇద్దరూ మృతి చెందారు. ఆకాంక్ష తల్లి డోనం శాంతికుమారి ఫిర్యాదు మేరకు సర్పవరం ఏఎస్సై నాగేశ్వరరావు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం సర్పవరం భావనారాయణపురంలో సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.